సాక్షి నిజామాబాద్

ఆదివారం । 28 । ఏప్రిల్ । 2024



రేషన్ డీలర్ల ధర్నా

బోధన్ ఎంఎల్ఎస్ పాయింట్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రేషన్ డీలర్లు ధర్నా చేశారు.

- 8లో ▸



కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు

కాంగ్రెస్ మోసపూరిత హామీలను నమ్మి ప్రజలు మోసపోవద్దని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
43.4 /28.5

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఎండ వేడిమి మరింత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

శనివారం నమోదైన ఉష్ణోగ్రతలు	మండలం	సాలూర	వర్ని	మోపాల్	నిజామాబాద్ నార్త్	మోస్రా	భీమ్‌గల్	డిచ్‌పల్లి	పోతంగల్	బోధన్	నిజామాబాద్ సౌత్	చందూరు	జక్రాన్‌పల్లి	వేల్పూర్	కోటగిరి	ఆర్మూర్	ఎడపల్లి	రెంజల్	కమ్మర్‌పల్లి	సిరికొండ	డొంకేశ్వర్
	గరిష్టం	44.8	44.3	44.2	43.9	43.7	43.7	43.5	43.3	43.2	43.1	42.8	42.8	42.7	42.6	42.6	42.5	42.4	42.2	42.1	42.1

న్యూస్‌రీల్

కుక్క దాడిలో చిన్నారికి గాయాలు





దాడి చేస్తున్న కుక్క.. గాయపడిన పూజిత

డిచ్‌పల్లి: వీధి కుక్క దాడిలో ఓ చిన్నారి తీవ్రంగా గాయపడింది. డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ గ్రామంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ప్రవళిక – విజయ్ దంపతుల కూతురు పూజిత ఇంటి ఎదుట రోడ్డుపై మరో బాలికతో ఆడుకుంటోంది. ఇంతలో డ్రెయినేజీలో పడుకున్న కుక్క ఒక్కసారిగా చిన్నారిపైకి దూకి కిందపడవేసి కరవడం ప్రారంభించింది. వెంటనే భయంతో మరో చిన్నారి పక్కనే ఉన్న కిరాణషాపులోకి పరుగెత్తింది. చిన్నారి కేకలు వేయడంతో ఆమె తల్లి ఇంట్లో నుంచి కర్ర తీసుకుని బయటకు పరుగెత్తుకు వచ్చి కుక్కను కొట్టింది. దీంతో చిన్నారిని వదిలిపెట్టిన కుక్క దూరంగా పరుగెత్తింది. కుక్క దాడిలో చిన్నారి చేతులు, మెడపై తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారిని డిచ్‌పల్లి ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. గ్రామంలో కుక్కల బెడదను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎంసీఎంసీ కేంద్రం సందర్శన



సుభాష్‌నగర్: కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) సెంటర్‌ను ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్, వ్యయ పరిశీలకుడు డీఎం నెమ్జి, పోలీస్ శాఖకు సంబంధించిన అబ్జర్వర్ రాజేశ్ మీనా శనివారం పరిశీలించారు. కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఐడీఓసీలో నెలకొల్పిన కంట్రోల్ రూంను సందర్శించారు. 1950 టోల్ ఫ్రీ ద్వారా వస్తున్న ఫిర్యాదులు, వాటిని పరిష్కరిస్తున్న తీరుతెన్నులు గమనించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరందు, ఎంసీఎంసీ సభ్య కార్యదర్శి ఎన్ పద్మశ్రీ, నోడల్ అధికారి పాపయ్య ఉన్నారు.

రుణమాఫీ చేస్తాం



బాల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో రైతులకిచ్చిన హామీ ప్రకారం రైతులకు రుణమాఫీని ఆగష్టు 15లోపు చేపడుతామని నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. మెండోరా మండలం దూదిగాం, మెండోరా, ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. స్వయంగా రైతు అయిన తనకు రైతుల కష్టాలు తెలుసన్నారు. బీజేపీ అభ్యర్థి అర్వింద్, బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌లకు వ్యవసాయం గురించి ఏం తెలుసన్నారు. ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, వెంకటేశ్, ముత్యం రెడ్డి, జక్క రాజేశ్వర్, చిన్నారెడ్డి, సుమో రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ఉదయం 11:40 గంటలకు జనసంచారం లేని పులాంగ్ చౌరస్తా



సుర్రుమన్న సూరీడు!

రికార్డు స్థాయిలో నమోదైన ఉష్ణోగ్రతలు

- సాలూరలో అత్యధికంగా 44.8 డిగ్రీలు
- బయటకు వెళ్లడానికి భయపడుతున్న జనం
- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి
- రానున్న రోజుల్లో 45 డిగ్రీలకు చేరే అవకాశం

సుభాష్‌నగర్: జిల్లాలో శనివారం రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. సాలూర మండల కేంద్రంలో అత్యధికంగా 44.8 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. జిల్లా వ్యాప్తంగా సగటు గరిష్ట ఉష్ణోగ్రత 43.4 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 28.5 డిగ్రీలు నమోదయ్యాయి. పగలు, రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండటంతో ఉక్కపోతతో ప్రజ లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రానున్న రోజుల్లో పగటి ఉష్ణోగ్రత 45 డిగ్రీలకు చేరుకునే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. మే రెండో వారం తర్వాత ఎండలు దంచి కొట్టనున్నాయి. ముఖ్య పట్టణాలతో పాటు పలు మండలాల్లో భానుడు ప్రతాపం చూపుతున్నాడు.

నిజామాబాద్ నగరం, ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్, డిచ్‌పల్లి తదితర ప్రాంతాల్లో రద్దీగా ఉండే ప్రదేశాలు దాదాపు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండ ధాటికి ఉదయం 11 గంటల తర్వాత బయటకు రావాలంటే ప్రజలు జంకుతున్నారు. అత్యవసరమైతే తప్ప తగిన జాగ్రత్తలు లేనిదే బయటకు రావడం లేదు.



మహిళలే నిర్ణేతలు

- పురుషుల కంటే 92,517 మంది మహిళా ఓటర్లు ఎక్కువ
- అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో వారే అత్యధికం
- మహిళా ఓటర్లలో బీడీ కార్మికులు, రైతులు, వ్యవసాయ, ఉపాధి కూలీలు



మోర్తాడ్(బాల్కొండ): నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న ఎంపీ అభ్యర్థులలో విజేతగా నిలిచేవారికి మహిళా ఓట్లు కీలకం కానున్నాయి. పార్లమెంట్ స్థానం పరిధిలోని మొత్తం ఓటర్లలో పురుషుల కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా నమోదయ్యారు.

■ నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, మొత్తం ఓటర్ల సంఖ్య 17,04,867 నమోదైతే ఇందులో 8,98,647 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. పురుషులు 8,06,130 మంది ఓటర్లు ఉన్నారు. ఇతరులు 90 మంది ఉ న్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 92,517 మంది ఎక్కువ ఉన్నారు. ఏడు నియోజకవర్గాలలో మహిళా ఓటర్లే పురుషుల కంటే ఎక్కువగా ఉండటం విశేషం. ఆర్మూర్‌లో 14,664 మంది, బోధన్‌లో 10,347 మంది, నిజామాబాద్ అర్బన్‌లో 10,762 మంది, నిజామాబాద్ రూరల్‌లో 17,049 మంది, బాల్కొండలో 17,347 మంది, జగిత్యాల్‌లో 9,867 మంది, కోరుట్లలో 12,481 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

■ ప్రతిసారి ఎన్నికల పోలింగ్ సరళి పరిశీలిస్తే మహిళా ఓటర్లే ముందుగా క్యూ కట్టి ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలోని మహిళా ఓటర్లలో బీడీ కార్మికులు, రైతులు, వ్యవసాయ, ఉపాధి కూలీలు ఉన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల మహిళలే ఎక్కువ మంది ఉండటంతో అభ్యర్థుల భవితవ్యం వీరి చేతుల్లోనే ఉంది. ఇదిలా ఉండగా మహిళా ఓటర్లలో గల్ఫ్ వలస కార్మికుల కుటుంబాలకు చెందినవారు ఉన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి పాటు పడే పార్టీ, అభ్యర్థులకు వీరు ఎక్కువగా మొగ్గుచూపే అవకాశం ఉంది. ఏది ఏమైనా నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో అభ్యర్థుల గెలుపోటములపై మహిళా ఓట్లు ప్రభావం చూపనున్నాయి.

నిలిచిపోయిన ఆర్‌వోబీ పనులు

- నిధులు విడుదల కాక ఆగిన మాధవనగర్ వంతెన నిర్మాణం
- వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు

నిజామాబాద్ రూరల్: మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు 20 రోజులుగా నిలిచిపోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.93 కోట్ల వ్యయంతో ఈ వంతెన నిర్మిస్తున్నారు. 20 రోజుల క్రితం వరకు పనులు జోరుగా సాగాయి. అయితే ప్రస్తుతం నిధులు లేక పనులు నిలిచిపోయాయి. ఆర్‌వోబీ పనులు ప్రారంభమై ఏడాదిన్నర అవుతోంది. 42 పిల్లర్లు నిర్మించారు. వాహనాలు వెళ్లడానికి అప్రోచ్ రోడ్లు వేశారు. ఇప్పటి వరకు వంతెన నిర్మాణానికి రూ.30కోట్ల వరకు ఖర్చు అయినట్లు ఆర్‌వోబీ అధికారులు తెలిపారు. అందులో రూ.15 కోట్లు మాత్రమే విడుదల అయ్యాయని, మిగతా నిధుల విడుదల్లో జాప్యం నెలకొందని వారు చెప్పారు. దీంతో కాంట్రాక్టర్ పనులు నిలిపి వేశారు. నిధులు మంజూరయ్యాకే పనులు మొదలు పెడతామని రైల్వే ఓవర్ బ్రిడ్జి అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఎన్నికలు ఉండటంతో నిధుల విడుదలలో జాప్యం నెలకొన్నట్లు తెలిసింది.



మాధవనగర్ వద్ద పిల్లర్ల స్టేజీలో నిలిచిన పనులు

పనులు వేగంగా చేపట్టాలి

మాధవనగర్ ఆర్‌వోబీ పనులు వేగంగా చేపట్టాలి. నత్తనడకన పనులతో రోడ్డుపై వెళ్లడానికి ఇబ్బంది అవుతోంది. రైల్వే గేట్ పడిన సమయంలో భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే వాహనదారులకు తిప్పలు తప్పుతాయి. – ప్రకాశ్, వాహనదారుడు

నిధులు లేకపోవడంతో..

మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల చేయడానికి నిధులు లేవు. దీంతో పనులు నిలిచిపోయాయి. దాదాపు రూ.16 నుంచి రూ.17 కోట్లు విడుదల కావాల్సి ఉంది.

– బ్రహ్మారెడ్డి, సైట్ ఇంజినీర్

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

- ఎంపీ ధర్మపురి అర్వింద్

ఆర్మూర్: కాంగ్రెస్ అమలుకు నోచుకోని హామీలను ఇస్తూ రైతులను మోసం చేస్తోందని ఎంపీ, నిజామాబాద్ బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. ఆర్మూర్‌లోని క్షత్రియ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన కిసాన్ మోర్చా సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. చెరుకు ఫ్యాక్టరీలను తెరిపించని కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు రైతుల నుంచి ఓట్లు ఎలా అడుగుతున్నారో వారికే తెలియాలన్నారు. ఫ్యాక్టరీల విలువను బహిర్గతం చేస్తే మేనేజ్‌మెంట్‌ల ఆధ్వర్యంలో నెల రోజుల్లో నడిపించే బాధ్యత తాను తీసుకుంటానని అర్వింద్ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి మోదీ దేశాన్ని అగ్రగామిగా నిలుపుతున్నారన్నారు. నిజామాబాద్ కేంద్రంగా ఏర్పాటు కానున్న పసుపు బోర్డుతో ఈ ప్రాంత రైతాంగం స్థితిగతులే మారిపోతాయన్నారు. అంతకుముందు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ హిందువులపై దాడులు చేస్తే ఊరుకొనేది లేదని హెచ్చరించారు. బీజేపీ కార్యకర్తలను బెదిరించడం మానుకోకపోతే కాంగ్రెస్ నాయకులకు గుణపాఠం చెబుతామన్నారు. లోక భూపతిరెడ్డి, నూతుల శ్రీనివాస్‌రెడ్డి, కోటపాటి నర్సింహనాయుడు, కంచెట్టి గంగాధర్, యామాద్రి భాస్కర్‌పటేల్ పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని జిల్లాకు నియమితులైన ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్, వ్యయ పరిశీలకులు డీఎం నెమ్జి, పోలీస్ శాఖకు సంబంధించిన అబ్జర్వర్ రాజేశ్ మీనా శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిజామాబాద్, జగిత్యాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు, నోడల్ ఆఫీసర్లతో భేటీ అయ్యారు. నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్, జగిత్యాల కలెక్టర్ డాక్టర్ యాస్మీన్ బాషా, ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ పరిశీలకులతో భేటీలో పాల్గొన్నారు. పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో ఎన్నికల నియమావళి అమలు, పోలింగ్, కౌంటింగ్ నిర్వహణకు చేపట్టిన చర్యల గురించి కలెక్టర్ అబ్జర్వర్లకు వివరించారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 17,04,867 మంది ఓటర్లు ఉండగా, నిజామాబాద్ జిల్లాలో 1,288 పోలింగ్ స్టేషన్లు, జగిత్యాలలో 516 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో రూ.1.22 కోట్ల నగదు, రూ.1.28 కోట్ల విలువ చేసే బంగారం, ఇతర వస్తువులను సీజ్ చేశామన్నారు. పోలీసులు, ఎక్సైజ్ శాఖల ద్వారా 52వేల లీటర్ల అక్రమ మద్యం నిల్వలను గుర్తించి పట్టుకున్నట్లు చెప్పారు. 15 మంది కన్నా ఎక్కువ అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచిన పక్షంలో అదనంగా బ్యాలెట్ యూనిట్లు కేటాయించేలా ఏర్పాట్లు చేసుకున్నామని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి సైతం మొదటి విడత శిక్షణ తరగతులు పూర్తి చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. మే 1, 2వ తేదీల్లో రెండోదఫా శిక్షణకు ఏర్పాట్లు చేశామన్నారు. రెండు రోజుల్లో 85 వేల పైచిలుకు స్లిప్పుల పంపిణీ పూర్తయ్యిందని వివరించారు. డిచ్‌పల్లి సీఎంసీ కళాశాలలో ఓట్ల లెక్కింపునకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎలిస్ వజ్ ఆర్

జగిత్యాల కలెక్టర్ యాస్మీన్ బాషా మాట్లాడుతూ కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో చేపట్టిన ఏర్పాట్ల గురించి పరిశీలకుల దృష్టికి తెచ్చారు. నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ ఓటర్లను ప్రలోభపర్చే చర్యలను నిరోధించేందుకు నాలుగు అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నామన్నారు. పాత నేరస్తులు, రౌడీషీట్ కలిగిన 943 మందిని బైండోవర్ చేశామని, లైసెన్సులు కలిగిన 76 ఆయుధాలను డిపాజిట్ చేయించామని వివరించారు. అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, జిల్లా అధికారులు ఉన్నారు.

విదేశీగడ్డపై బహుముఖ ప్రజ్ఞ

- అమెరికాలో 'సాన్వి' ప్రతిభ!
- నృత్యం, స్విమ్మింగ్, యోగాలో రికార్డులు

సాక్షి, కామారెడ్డి: పసిప్రాయం నుంచే వివిధ కళల్లో తన ప్రతిభ చాటుతూ మన దేశ కీర్తిని ఖండాతరాల్లో చాటుతోంది జిల్లాకు చెందిన యువతి. ఉద్యోగరీత్యా అమెరికాకు వెళ్లిన ఏనుగు సాయిరెడ్డి, సునీతారెడ్డిల కూతురు సాన్వి పసిప్రాయం నుంచే వివిధ కళల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తోంది. తాడ్వాయి మండలం కన్కల్ గ్రామానికి చెందిన ఈ కుటుంబం అమెరికాలోని టెక్సాస్‌లో ఉంటోంది. సాయిరెడ్డి, సునీతలకు ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. కూతురు సాన్వి నాలుగేళ్ల వయసులోనే నృత్యంపై ఆసక్తి చూపడంతో తల్లిదండ్రులు ప్రోత్సహించారు. అక్కడే వేదాన్వి డ్యాన్స్ అకాడమీలో మాధవి బొలిశెట్టి వద్ద కూచిపూడి నృత్యం నేర్పించారు. కూచిపూడిలో అమెరికాలో జరిగిన ఎన్నో పోటీల్లో ఆమె ప్రతిభ కనబరుస్తోంది. ఇటీవల అమెరికన్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో 'సయ్యంది పాదం' పేరుతో డ్యాన్స్ కాంపిటీషన్ నిర్వహించారు. డల్లాస్, టెక్సాస్ నుంచి సాన్వి పాల్గొని తన ప్రతిభతో రెండోస్థానం దక్కించుకుంది. అంతేకాకుండా త్వరలో జరగనున్న 18వ ఆట కన్వెన్షన్ యూత్ కాన్ఫరెన్స్‌లో ఫైనల్‌కి సెలెక్ట్ అయ్యింది. గడిచిన ఏడెనిమిదేళ్లుగా వందకు పైగా ప్రదర్శనలు ఇచ్చిన సాన్వి అందరి మన్ననలు అందుకుంది. కూచిపూడి నృత్యమే కాదు ఈత పోటీల్లోనూ సాన్వి దిట్ట. అమెరికాలో జరిగే పోటీలన్నింటిలోనూ సాన్వి పాల్గొని ఎన్నో బహుమతులు గెలుచుకుంది. యోగా పోటీల్లో పాల్గొని పలు అవార్డులు సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా సాన్వి తల్లి సునీతారెడ్డి 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడుతూ.. తన కూతురు సాన్వి పారుగు గడ్డ మీద చూపుతున్న ప్రతిభను చూసి అందరూ అభినందిస్తుంటే ఆనందంగా ఉందని, మన దేశ కీర్తిని పెంచుతుండడం గర్వకారణమని పేర్కొన్నారు.



కాంగ్రెస్‌వి అబద్ధపు హామీలు

- ఆ పార్టీని గెలిపించినందుకు ప్రజలు బాధపడుతున్నారు
- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి: ఎన్నికల్లో గెలవడానికి కాంగ్రెస్ అబద్ధపు హామీలు ఇచ్చిందని, ఆ పార్టీని గెలిపించినందుకు ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. శనివారం డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ శివారులోని సుగుణ గార్డెన్స్‌లో మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూరల్ ఎమ్మెల్యేగా పదేళ్లలో తాను చేసిన అభివృద్ధి ప్రజలకు తెలుసన్నారు. ఎంపీ కావాలనేది తన ఆశయమని, ప్రజలు ఆశీర్వదిస్తే ఎంపీగా పార్లమెంట్‌లో అడుగుపెడతానని బాజిరెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. పసుపు బోర్డు కూడా నిజామాబాద్‌లోనే ఏర్పాటయ్యేలా కృషి చేస్తానన్నారు. కార్యకర్తలు ఇంటింటికి తిరిగి బీఆర్‌ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని సూచించారు. అలాగే కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా చేసిన మోసాన్ని ప్రజలకు వివరించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తానని చెబుతున్నారని కానీ రైతులు నమ్మడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కంటే ఎక్కువ కాలం అధికారంలో ఉండదని జోస్యం చెప్పారు. నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఐదు రోజుల్లో పసుపు బోర్డు తెస్తానని ఐదేళ్లయినా తేలకపోయారని విమర్శించారు. ఎంపీగా అర్వింద్ నిజామాబాద్ అభివృద్ధికి చేసింది శూన్యమన్నారు. ఓట్ల కోసం వచ్చినప్పుడు అర్వింద్‌ను ప్రజలు నిలదీయాలని కోరారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. మాజీ ఎమ్మెల్సీ వి గంగాధర్‌గౌడ్, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, డిచ్‌పల్లి ఎంపీటీసీ దాసరి ఇందిర, లక్ష్మీనర్సయ్య, శక్కరికొండ కృష్ణ, ఒడ్డెం నర్సయ్య, పద్మారావు, రాజు, గోపి, గీత, లింగం, శ్రీనివాస్‌గౌడ్, శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

క్లుప్తంగా

తౌసిఫ్ హైమద్‌కు డాక్టరేట్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగం పరిశోధక విద్యార్థి మహమ్మద్ తౌసిఫ్ హైమద్ డాక్టరేట్ సాధించారు. ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ నసీం ఆధ్వర్యంలో 'ఇంపాక్ట్ ఆఫ్ వేరియబుల్ ఆక్సిడేషన్ స్టేట్స్ ఆఫ్ హెవీ మెటల్స్ ఇన్ ఎడ్సార్ప్షన్ ఆన్ నానో ఎడ్సార్బంట్ ఇన్ఫ్యూజ్డ్ విత్ నేచురల్ అక్కరింగ్ ఆర్గానిక్ యాసిడ్స్' అనే అంశంపై తౌసిఫ్ హైమద్ పరిశోధన గ్రంథం సమర్పించారు. తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ సెమినార్ హాల్‌లో శనివారం నిర్వహించిన వైవావోస్ కు ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ జాదవ్ రాంచందర్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. తెయూ రిజిస్ట్రార్ ఎం.యాదగిరి, సైన్స్ డీన్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, హెచ్‌వోడీ శిరీష బోయపాటి, అధ్యాపకులు వాసం చంద్రశేఖర్, సత్యనారాయణ, విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జింకపిల్ల అప్పగింత



రెంజల్(బోధన్): కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన జింక పిల్లను స్థానికులు ఫారెస్టు అధికారులకు అప్పగించారు. శనివారం నీలా శివారులో కుక్కలు జింక పిల్లపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చడాన్ని గమనించిన రైతు లు కుక్కలను తరిమివేసి జూనియర్ వెటర్నరీ అసిస్టెంట్ భీమ్‌రావు రాథోడ్‌కు సమాచారం అందించారు. ఆయన ఘటనాస్థలానికి చేరుకొ ని జింకపిల్లకు చికిత్స చేశారు. అనంతరం నవీపేట్ బీట్ అధికారి ప్రసాద్‌కు జింకపిల్లను అ ప్పగించారు. మండల కాంగ్రెస్ బీసీ సెల్ నా యకుడు గంగాకృష్ణ,సాయినాథ్,రైతులు ఉన్నారు.

చెక్‌పోస్ట్ పరిశీలన



నవీపేట: మండలంలోని యంచ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను ఎన్నికల వ్యయ పరిశీలకులు డీఎం నెమ్జీ శనివారం పరిశీలించారు. చెక్ పోస్ట్ పరిధిలో చేపట్టిన తనిఖీల వివరాలు, పట్టుబడిన మద్యం,డబ్బుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట జిల్లా ఎన్నికల వ్యయ కమిటీ నోడల్ ఆఫీసర్ పాపయ్య ఉన్నారు.

సౌత్ క్యాంపస్‌లో ఓటరు అవగాహన సదస్సు

భిక్కనూరు : తెయూ దక్షిణ ప్రాంగణంలో శనివారం జాతీయ సేవాపథం ఆధ్వర్యంలో ఎస్‌వైకే నిజామాబాద్ సహకారంతో ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అంజయ్య మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులకు వ్యాసరచనతో పాటు నినాదాలు రాయడంపై పోటీలు, అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ అచార్యులు డాక్టర్ సబిత, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ముత్యాల పోచమ్మకు బోనాలు



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి గ్రామంలో ముత్యాల పోచమ్మకు గ్రామస్తులు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఇంటింటికీ బోనం తీసుకొని అమ్మవారికి సమర్పించారు. ముత్యాల పోచమ్మ ఆలయాన్ని పునర్నిర్మాణం చేసి శుక్రవారం ఉదయం వేదమంత్రాలతో యజ్ఞం, హోమగుండాల ద్వారా ప్రత్యేక పూజలు చేశారు.

అస్తవ్యస్తంగా పునర్విభజన

- వేల్పూర్ మండలంలో విలీనమైన రామన్నపేట్
- మోర్తాడ్ మండల పరిధిలోనే పోలీస్, విద్యుత్, వైద్యారోగ్యశాఖల సేవలు
- కొత్త మండలంలో రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర సేవలు



రామన్నపేట్ గ్రామ ముఖచిత్రం

మోర్తాడ్: మండలాల పునర్విభజన పూర్తయిన ఎనిమిదేళ్లవుతున్నా రామన్నపేట్ గ్రామ సమస్యకు గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఇంకా పరిష్కారం చూపలేకపోయాయి. మండలాల పునర్విభజనలో భాగంగా 2016లో అప్పటి వరకు మోర్తాడ్ మండలంలో కొనసాగిన రామన్నపేట్‌ను వేల్పూర్ మండలంలో విలీనం చేశారు. పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్య, నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి శాఖల సేవలు అన్ని వేల్పూర్ మండలంలోనే అందుకుంటున్న రామన్నపేట్ వాసులు.. మూడు కీలక శాఖలకు సంబంధించి సేవల కోసం మాత్రం ఇప్పటికీ మోర్తాడ్ మండలంపై ఆధారపడి ఉన్నారు. రామన్నపేట్ ఇంకా మోర్తాడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోనే కొనసాగుతోంది. వైద్యారోగ్య శాఖ సబ్ సెంటర్ కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కొనసాగుతోంది. మోర్తాడ్‌లో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటైన తరువాత ఈ మండలం పరిధిలోని వారికి వైద్య సేవలు కమ్మర్‌పల్లి, చౌట్‌పల్లి పీహెచ్‌సీల ద్వారా అందుతున్నాయి. విద్యుత్ శాఖకు సంబంధించి పునర్విభజన జరగకపోవడంతో మోర్తాడ్ సెక్షన్ పరిధిలోనే రామన్నపేట్ సబ్‌స్టేషన్ కొనసాగుతోంది. మండలాల పునర్విభజన సమయంలోనే అన్ని శాఖల విభజన కూడా పూర్తి కావాల్సి ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధుల అవగాహన లోపం, పట్టింపులేనితనం కారణంగా రామన్నపేట్ గ్రామస్తులు కొన్ని సేవల కోసం వేల్పూర్ మండలానికి, మరికొన్ని సేవల కోసం మోర్తాడ్ మండలాన్ని చుట్టాల్సి వస్తోంది. తమ గ్రామాన్ని వేల్పూర్ మండలంలో విలీనం చేయడం ఇష్టం లేదని అప్పట్లోనే గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. మోర్తాడ్ మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉండగా ఆరు గ్రామాలతో ఏర్గట్ల మండలాన్ని కొత్తగా ఏర్పాటు చేశారు. 10 గ్రామ పంచాయతీలతో మోర్తాడ్‌ను చిన్న మండలంగా మార్చి, రామన్నపేట్‌ను వేల్పూర్ మండలంలో విలీనం చేశారు. ప్రజల అభీష్టానికి విరుద్ధంగా రామన్నపేట్‌ను మరో మండలంలో విలీనం చేసినా అన్ని శాఖలను పునర్విభజన చేయకపోవడంపై గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకొని పూర్తి స్థాయిలో పునర్విభజన చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మా కష్టాలను గుర్తించలేదు

రామన్నపేట్‌ను వేల్పూర్‌లో విలీనం చేశారు. అప్పట్లో మా ఆందోళనను పెడచెవిన పెట్టారు. మా గ్రామ ప్రజల కష్టాలను గుర్తించే నాయకులు లేకపోవడంతో పునర్విభజన పూర్తిస్థాయిలో జరగలేదు. గతంలోని నాయకులకు ప్రజల కష్టాలు తెలిసి ఉంటే అన్ని శాఖల సేవలను వేల్పూర్ మండలంలోనే కొనసాగించేలా చేసేవారు. నాయకులకు వారి పదవులే ముఖ్యం, ప్రజల ఇబ్బందులు అవసరం లేదు. అందుకే మా పరిస్థితి ఇలా ఉంది.

– ఎం.గంగాధర్, రామన్నపేట్

కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోవద్దు

- బీజేపీ మతాన్ని అడ్డం పెట్టుకుంటోంది
- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి విమర్శ



మోస్రా కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న బాన్సువాడ ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

వర్ని: కాంగ్రెస్ మోసపూరిత హామీలను నమ్మి ప్రజలు మోసపోవద్దని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మోస్రా, చందూర్, వర్ని మండల కేంద్రాల్లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కార్నర్ మీటింగ్‌లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అమలుసాధ్యం కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో కూడా మోసపు హామీలు ఇస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత కరెంటు కోతలు, రైతుల ఆత్మహత్యలు, తాగునీటి సమస్యలు పెరిగిపోయాయని, ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏ మాత్రం చొరవ చూపడం లేదన్నారు. బీజేపీ నాయకులు మతాన్ని అడ్డం పెట్టుకొని ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని, కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మొద్దని సూచించారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివద్ధి చేసి ఆదర్శంగా నిలబెట్టిన బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్, జిల్లా సహకార బ్యాంకు మాజీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, మోస్రా జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పిట్ల శ్రీరాములు, వర్ని మండల పార్టీ అధ్యక్షుడు గిరి, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తిరిగి విధుల్లోకి సమగ్ర శిక్ష ఉద్యోగులు!

ఆర్మూర్: విధుల్లో నుంచి తొలగించిన సమగ్ర శిక్ష ఉద్యోగులను తిరిగి తీసుకోవాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగులను ఈ నెల 29వ తేదీలోగా యథాస్థానంలో రెన్యువల్ చేయాలని ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లా వ్యాప్తంగా 910 మంది ఉద్యోగులకు ఈ ఉత్తర్వులు వర్తించనున్నాయి. అదేవిధంగా భవిత ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న కేర్ గివింగ్ వలంటీర్లను, ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లను విద్యా సంవత్సరం చివరి పనిదినమైన ఈ నెల 24వ తేదీన విధుల్లో నుంచి తొలగించాలని సూచించారు. వీరిని రెన్యువల్ చేయడానికి మాత్రం తదుపరి ఉత్తర్వుల కోసం వేచి చూడాలని పేర్కొన్నారు.

జిల్లాలో 910 మంది ఉద్యోగులు

కేజీబీవీల్లో బోధన, బోధనేతర సిబ్బంది 571 మంది, యూఆర్ఎస్ బోధన, బోధనేతర సిబ్బంది 10 మంది, డీపీవో సిబ్బంది 9 మంది, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు 22 మంది, డాటా ఎంట్రీ ఆపరేటర్లు 29 మంది, ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ 49 మంది, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ (సీఆర్పీ) 94 మంది, డీఎస్ఎంటీలు, పీటీఐలు 88 మంది, మెసెంజర్లు 19 మంది, సిస్టమ్ అనాలసిస్ట్, ఏపీవో, అకౌంటెంట్, ఇద్దరు డిస్ట్రిక్ టెక్నికల్ పర్సన్స్, సీజీవీలు 19 మంది, ఇద్దరు నైట్ వాచ్‌మెన్లు విధులు నిర్వర్తిస్తున్నారు.

పనితనం ఆధారంగా తిరిగి విధుల్లోకి

సమగ్ర శిక్షలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పనితనం ఆధారంగా వారిని తిరిగి విధుల్లో చేర్చుకుంటాం. వారు ఏ అధికారి వద్దనైతే విధులు నిర్వర్తిస్తున్నారో ఆ అధికారి నుంచి పనితనానికి సంబంధించిన ధ్రువ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

– దుర్గాప్రసాద్, జిల్లా విద్యాధికారి, నిజామాబాద్

ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద రేషన్ డీలర్ల ధర్నా



ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ధర్నా చేస్తున్న రేషన్ డీలర్లు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం పాయింట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సివిల్ సప్లయీస్ డీఎం, డీఎస్‌వోతో మాట్లాడారు.

ఈ సందర్భంగా రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భీష్మగౌడ్ మాట్లాడుతూ.. గతంలో రేషన్ డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్‌కు వచ్చి సంతకం చేసిన తరువాతే బియ్యాన్ని సరఫరా చేసేవారన్నారు. ఇటీవల కాలంలో డీలర్ వేలిము ద్ర లేకుండానే రాత్రి వేళల్లో 10గంటల తరువాత దుకాణాల వద్ద బియ్యం వేసి వెళ్లిపోతున్నారని, సంచులు చినిగి, బియ్యం తక్కువగా వస్తున్నాయని అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బియ్యం సరఫరాలో సమయ పాలన పాటించాలని, డీఎస్‌వోను కోరగా స్పందించిన డీఎస్‌వో సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానన్నారు. సనా పటేల్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



సిరికొండ: సౌత్ జోన్ సాఫ్ట్‌బాల్ జాతీయ ఛాంపియన్ షిప్ పోటీలకు సత్యశోధక్ పాఠశాల విద్యార్థి సిద్ధార్థ ఎంపికయ్యాడు. కర్నాటక రాష్ట్రంలో ఈ నెల 28 నుంచి జరిగే ఛాంపియన్ షిప్ పోటీల్లో సిద్ధార్థ పాల్గొంటాడని ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు. విద్యార్థికి శనివారం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగామోహన్, ప్రిన్సిపాల్ జ్ఞాపిక అందజేసి అభినందించారు. గంగారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు అనిల్, సంతోష్, శ్రీనివాస్ ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

సుభాష్‌నగర్: నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లోగల మర్చంట్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం నిజామాబాద్ మర్చంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కమల్ కిషోర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా లాభిషెట్టి శ్రీనివాస్, రమేష్ గుప్తా వ్యవహరించారు. ప్రధాన కార్యదర్శి పదవికి నలుగురు పోటీ చేయగా, మారుతి మల్లేష్ గెలుపొందారు. అలాగే కోశాధికారి పదవికి ఇద్దరు పోటీ చేయగా, అఖిల్ రాజ్ రాజేందర్ విజయం సాధించారు. పూర్తి స్థాయి కమిటీని త్వరలోనే ఎన్నుకుంటామని అధ్యక్షుడు కమల్ కిషోర్ ఇనాని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీని అభినందించారు. మర్చంట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్ష గురుకులం బాల శిబిరం ముగింపు

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి పట్టణం పాతరాజంపేట శివారులోని ఆర్ష గురుకులంలో నిర్వహిస్తున్న బాలల శిబిరం ముగింపు కార్యక్రమం ఈనెల 28న ఆదివారం ఉదయం 8గంటలకు నిర్వహించనున్నట్లు గురుకులం సమన్వయకర్త పండిట్ హరిదాస్ ఆర్య తెలిపారు. ముగింపు శిబిరంలో బాలల ప్రదర్శనలు, వక్తల ప్రసంగాలు, ఆశీర్వాదాలు, అభిప్రాయాలుంటాయని ఆయన పేర్కొన్నారు.

ప్రొఫెసర్ నసీం సేవలు మరువలేనివి



ప్రొఫెసర్ నసీంను సన్మానిస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి, టూటా ప్రతినిధులు

తెయూ(డిచ్‌పల్లి): విద్యాభివృద్ధిలో మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నసీం సేవలు మరవలేనివని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం.యాదగిరి కొనియాడారు. తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టూటా) ఆధ్వర్యంలో శనివారం ప్రొఫెసర్ నసీం పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నసీంను పూలమాల, శాలువా, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. ప్రొఫెసర్ నసీం ఉన్నతమైన ఆలోచనలతో తెలంగాణ యూనివర్సిటీ లో అడుగుపెట్టి పారదర్శకమైన పరిపాలన కొనసాగించారన్నారు. పరిపాలనలో మచ్చలేని వ్యక్తిగా నసీం పదవీ విరమణ చేయడం ఆనందంగా ఉందన్నారు. టూటా అధ్యక్షుడు పున్నయ్య, కోశాధికారి ఏ.నాగరాజు, వైస్ ప్రెసిడెంట్స్ సత్యనారాయణరెడ్డి, రాజేశ్వరి, సహాయ కార్యదర్శులు బాలకిషన్, నీలిమ, శిరీష బోయపాటి, అధ్యాపకులు వాసం చంద్రశేఖర్, కిరణ్మయి, జవేరియా ఉజ్మా, కేవీ రమణాచారి, లక్ష్మణ చక్రవర్తి, పార్వతి, అబ్దుల్ ఖవి, స్వప్న, మహేందర్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



మారుతి (ఫైల్)

బాన్సువాడ : పట్టణంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పెంట మారుతి(32) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బీర్కూర్ మండలం చించొలికి చెందిన మారుతి,నస్రుల్లాబాద్ మండలం నాచుపల్లికి చెందిన సాయికుమార్ బాన్సువాడలో పనులు ముగించుకుని బైక్‌పై ఇంటికి తిరిగి వెళ్తుండగా.. పెద్దపూల్ బ్రిడ్జి వద్ద బోధన్ నుంచి బాన్సువాడ వైపు అతివేగంతో వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో మారుతి, సాయికుమార్ ఇద్దరు కిందపడిపోగా, అదే సమయంలో బాన్సువాడ నుంచి బోధన్ పైపు వెళ్తున్న లారీ ఇరువురి కాళ్లపై నుంచి వెళ్లడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే స్థానికులు బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి, అక్కడి వైద్యుల సూచన మేరకు నిజామాబాద్‌కు తరలించారు. మారుతిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. సాయికుమార్ నిజామాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి భార్య శకుంతల ఫిర్యాదు మేరకు కారు, లారీ డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణ తెలిపారు.

స్కూటీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో..



ఘటనాస్థలంలో రమణయ్య

కామారెడ్డి క్రైం: స్కూటీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన వల్లెపు రమణయ్య(52) శనివారం మృతి చెందాడు. రమణయ్య ఎలక్ట్రిక్ స్కూటీపై ఇంటర్నేషనల్ హోటల్ సమీపంలో రోడ్డు దాటుతుండగా నిజామాబాద్ నుంచి కామారెడ్డి వైపు వస్తున్న బస్సు ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన రమణయ్యను జిల్లా కేంద్రప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు పవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

బండరాయితో మోది భర్త హత్య

- పోలీసుల అదుపులో భార్య
- వివాహేతర సంబంధమే కారణం?
- ఒకే పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు రోజుల వ్యవధిలో రెండు హత్యలు



లక్ష్మణ్ (ఫైల్)

మోపాల్(నిజామాబాద్‌రూరల్):మండలంలోని న్యాల్‌కల్‌లో బోదాసు లక్ష్మణ్ (38) అనే వ్యక్తిని బండరాయితో మోది భార్య హత్య చేసిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్సై గంగాధర్, గ్రా మస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సమీ ప బంధువులైన బోదాసు లక్ష్మణ్, లావణ్య పెళ్లికా గా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. లక్ష్మణ్ కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. తాజాగా శుక్రవా రం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో గాఢనిద్రలో ఉన్న లక్ష్మణ్‌ను బండ రాయితో మోది లావణ్య హత్యచేసింది. విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు గ్రామస్తులకు, పోలీసులకు సమాచా రం అందించారు. సీఐ సురేశ్, ఎస్సై గంగాధర్ ఘటనాస్థలానికి చేరుకుని విచారించగా భర్తను తానే హత్య చేసినట్లు లావణ్య ఒప్పుకోగా, ఆమెను అ దుపులోకి తీసుకొని లక్ష్మణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

లావణ్యకు కొన్నేళ్లుగా గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందని, గతంలో సదరు వ్యక్తితో వెళ్లిపోగా కుల పెద్దలు ఒప్పించి తీసుకువచ్చినట్లు తెలిసింది. హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు, గ్రామస్తులు అనుమానిస్తున్నారు. మృతుడి సోదరుడు పురుషోత్తం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వరుస హత్యలు


మండలంలోని కులాస్‌పూర్‌లో భర్తను గొంతు నులిమి హత్య చేసిన ఘటన జరిగిన మరునాడే న్యాల్‌కల్‌లో భర్తను భార్య బండ రాయితో మోది హత్య చేయడం కలకలం సృష్టించింది. రెండు రోజుల్లో ఒకే పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు వరుస హత్యలు జరగడం చర్చనీయాంశమైంది.

దేశ అభివృద్ధి మోదీతోనే సాధ్యం



పెద్దకొడప్‌గల్(జుక్కల) : దేశ అభివృద్ధి నరేంద్ర మోదీతోనే సాధ్యమని బీజేపీ మండల అధ్యక్షులు బాలాజీ పటేల్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో గడపగడపకు తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్‌ను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సంజయ్, అశోక్ పటేల్, యువ నాయకులు తానాజీ, కృష్ణ పంతులు, నవీన్, చిప్ప రాము, ప్రేమ్ సింగ్, అశోక్ పాల్గొన్నారు.

విలువల ప్రాధాన్యతపై శిబిరం



కామారెడ్డి అర్బన్ : ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కామారెడ్డి ఓంశాంతి కేంద్రంలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్నారులకు ఒకరోజు శిబిరం నిర్వహించారు. జీవితంలో విలువల ప్రాధాన్యత, సృజనాత్మకత, పిల్లల్లో జ్ఞాపకశక్తి, ధ్యానం గూర్చి వివరించారు. శిబిరంలో రాజయోగిని జయదీదీ, డాక్టర్ అనూష, శ్రావణ్, ఇంద్రజాలికులు రామకృష్ణ, బీకే వనజ, గంగలత, సంతోషిని వివిధ అంశాలపై పిల్లలకు వివరించారు. సుమారు 120 మంది చిన్నారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో కొనసాగుతున్న చేరికలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కోమట్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త రమేశ్‌గౌడ్, వార్డు సభ్యులు ప్రభాకర్, లక్ష్మణ్, సాయిరెడ్డితో పాటు తన అనుచరులతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో చేరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కోలుకుంటున్న క్షతగాత్రులు

నిజామాబాద్‌రూరల్: బడాపహాడ్‌కు వెళ్తుండగా గురువారం రాత్రి వ్యాన్ బోల్తాపడిన ఘటనలో గాయాలపాలైన వారు జిల్లా కేంద్ర ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. 15 మంది క్షతగాత్రులు కోలుకుంటున్నారని రూరల్ ఎస్‌హెచ్‌వో, ట్రెయినీ ఐపీఎస్ చైతన్యరెడ్డి తెలిపారు.

ఇరువురిపై కేసు నమోదు

బోధన్ టౌన్ (బోధన్): పట్టణానికి చెందిన యూసుఫ్, అర్బాజ్ ఖాన్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. పట్టణ శివారులో ఉన్న యూసుఫ్‌కు చెందిన చాందిని దాబా వద్ద శుక్రవారం రాత్రి అర్బాజ్‌ఖాన్ ఇసుక టిప్పర్‌ను ఆపి డబ్బులు డిమాండ్ చేయగా.. ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో అర్బాజ్‌ఖాన్ చెవికి దెబ్బ తగలగా, ఆగ్రహంతో అర్బాజ్ ఖాన్ మరో ఇద్దరిని తీసుకొని యూసుఫ్ ఇంటికి తీసుకెళ్లి గొడవపడ్డాడు. ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేయగా, ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డుపై ధాన్యం ఆరబోసిన రైతుపై..

నవీపేట: మండలంలోని నాగేపూర్ – బాసర రోడ్డుపై ధాన్యం ఆరబోసి వాహనదారుడి మృతి కారణమైన రైతుపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. ఈనెల 22వ తేదీన నాగేపూర్ నుంచి నవీపేటకు బైక్‌పై వస్తున్న నేత సాయిలు అనే వ్యక్తి ధాన్యం కుప్పను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు ధాన్యం కుప్ప యజమాని మునీర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం

ఎడపల్లి (బోధన్): మండలంలోని జానకంపేట్‌కు యువతి చిక్కెల సహస్ర (19) అదృశ్యమైనట్లు ఎస్సై వంశీచందర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సహస్ర శనివారం ఉదయం 6 గంటల నుంచి కనిపించడం లేదని, కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికినప్పటికీ యువతి ఆచూకీ లభించలేదన్నారు. యువతి అన్నయ్య చిక్కెల సంజీవ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మరదలి ఇంటికి నిప్పంటించిన బావ

- తమ్ముడు ప్రేమ వివాహం చేసుకున్నాడని ఆగ్రహం

ఖలీల్‌వాడి: తమ్ముడు ప్రేమ వివాహం చేసుకున్నాడనే కోపంతో మరదలి ఇంటికి బావ నిప్పంటించాడు. ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై అశోక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..

మజహర్, అమర్ ఇద్దరు అన్నాదమ్ముళ్లు. వీరిద్దరూ పెయింటింగ్ పని చేస్తూ జీవిస్తున్నారు. అమర్ ఓ యువతిని ప్రేమించానని, తననే పెళ్లి చేసుకుంటానని అన్నతో చెప్పడంతో ఇద్దరి మధ్య గత కొంతకాలంగా గొడవ జరుగుతోంది. ఇటీవల ఎడపల్లి మండల కేంద్రంలోని హాజీ సమక్షంలో అమర్ తాను ప్రేమించి అమ్మాయిని పెళ్లి చేసుకోగా, ఆమె ప్రస్తుతం శాంతినగర్‌లోని తన అమ్మమ్మ మలీబేగం వద్ద ఉంటోంది. విషయం తెలుసుకున్న మజహర్ శుక్రవారం అర్ధరాత్రి వారి ఇంటికి నిప్పంటించాడు. ఈ ఘటనలో ఇంట్లోని దుస్తులతోపాటు సామగ్రి దగ్ధమైంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని సీహెచ్ కొండూర్‌కు చెందిన షేక్ సాహెదా (40) మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఈ నెల 21వ తేదీన నీటి కుళాయి వద్ద గ్రామానికి చెందిన కుమ్మరి లక్ష్మి, జింకుల పోసానితో సాహెదాకు తోపులాట జరిగింది. ఈ గొడవలో సాహెదా దుస్తులు చిరిగిపోవడంతో అవమానభారంతో మనస్తాపానికి గురైంది. ఈకారణంగా 25వ తేదీన ఇంట్లో ఎవరూలేనిసమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త అబీబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ తెలిపారు.

పోలీసుల అదుపులో నిందితులు

భీమ్‌గల్: మండలంలోని బడాభీమ్‌గల్, బెజ్జోరా గ్రామాలకు చెందిన నలుగురిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. నలుగురు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు వారి ఇళ్లలో పోలీసులు తనిఖీలు నిర్వహించగా గంజాయి లభ్యమైంది. గంజాయిని స్వాధీనం చేసుకొని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.